క్లుప్తంగా

సౌత్ క్యాంపస్ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్‌గా హరిత



భిక్కనూరు: తెలంగాణ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్ ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్‌గా ఫిజిక్స్ విభాగానికి చెందిన డాక్టర్ హరితను నియమించారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి నియామకపత్రాన్ని శనివారం అందజేశారు. హరిత గతంలో సౌత్ క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా, ఫిజిక్స్ హెచ్‌వోడీగా, బీఎస్‌వోగా పనిచేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ.. ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను ముమ్మరంగా నిర్వహిస్తామన్నారు. తనపై నమ్మకంతో తనకు ఎన్‌ఎస్‌ఎస్ కో–ఆర్డినేటర్‌గా నియమించిన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ వాకాటి కరుణ, రిజిస్ట్రార్ యాదగిరిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు.

గోవాకు అర్చరీ క్రీడాకారులు



దోమకొండ: జాతీయస్థాయి అర్చరీ పోటీల్లో పాల్గొనడానికి శనివారం దోమకొండ నుంచి అర్చరీ క్రీడాకారులు గోవాకు బయలుదేరారు. గోవాలో ఎనిమిది రోజుల పాటు జరుగనున్న జాతీయ స్థాయి అర్చరీ పోటీల్లో పాల్గొనడానికి తెలంగాణ రాష్ట్ర జట్టు తరఫున వీరు బయలుదేరినట్లు అర్చరీ కోచ్ ప్రతాప్ దాస్ తెలిపారు. క్రీడాకారులు కదిరే సింధూజ, నికిత, భవాని తదితరులు బయలుదేరి వెళ్లారు. వీరికి అర్చరీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల తిర్మల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కదిరే మోహన్‌రెడ్డిలు వీడ్కోలు పలికారు. పతకాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

వాహనాల తనిఖీ

పిట్లం(జుక్కల్): మండలంలోని పిట్లం – బాన్సువాడ రహదారిలో మద్దెలచెరువు గ్రామం వద్ద శనివారం అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి బ్రహ్మం మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ దృష్ట్యా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలీసులతో కలిసి వాహనాలు తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్పీకర్‌కు మద్దతుగా భారీ ర్యాలీ

బాన్సువాడ: బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన కమ్మ సామాజిక వర్గ నేతలు శనివారం భారీ కార్ల ర్యాలీ నిర్వహించారు. బాన్సువాడ పట్టణంలో కార్ల ర్యాలీని స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. తాను ఎన్నికల్లో నిలబడినప్పటి నుంచి కమ్మ సామాజిక వర్గం తన వెంటే ఉన్నారని అన్నారు. ప్రతి సారి ఎన్నికల్లో వర్నీ, కోటగిరి, బీర్కూర్ మండలాల నుంచే అత్యధిక మెజార్టీ లభించిందని గుర్తు చేశారు. కమ్మ సామాజిక వర్గం కుటుంబ సభ్యులతో వచ్చి ర్యాలీకి హాజరుకావడం సంతోషమని అన్నారు.

అభినందనలు

కామారెడ్డి అర్బన్: జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కామారెడ్డి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జి.గోపిగౌడ్‌ను ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ అభినందించారు. శనివారం గౌడ సంఘం జిల్లా నాయకులు ప్రభుత్వ విప్‌ను ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా గోపిగౌడ్‌ను సన్మానించారు. నాయకులు వేణుగోపాల్‌గౌడ్, నర్సాగౌడ్, కే.సిద్దాగౌడ్, తులసీ రాంగౌడ్, రవితేజగౌడ్, సాయాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హరితవనాల పరిశీలన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ధర్మారెడ్డి శివారులో హరితవనాలను శనివారం స్థానిక ఎంపీడీవో రఘు పరిశీలించారు. హరితవనాలలోని మొక్కలకు నీటిని పట్టించాలని ఆయన సూచించారు. మొక్కల మధ్య పెరుగుతున్న పిచ్చిమొక్కలను వెంటనే తొలగింపజేయాలని చెప్పారు. హరితహారంలో భాగంగా నాటిన ప్రతిమొక్కను సంరక్షించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

బహుజన్ ముక్తి పార్టీ ప్రచారం

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ నియోజవకర్గ బహుజన్ ముక్తి పార్టీ అభ్యర్థిగా కందర్పల్లి కాశీనాథ్ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అంసోల్ లక్ష్మణ్ తెలిపారు. శనివారం జుక్కల్ మండల కేంద్రం లోని చౌరస్తాలో పార్టీ అభ్యర్థితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభ్యర్థిని గెలిపిస్తే జుక్కల్‌ను అభివృద్ధి చేస్తామన్నారు.

భక్తిశ్రద్ధలతో నవదుర్గా వ్రతం

కామారెడ్డి అర్బన్: పున్నమి సందర్భంగా స్థానిక శారదా ఆది శంకర ఆలయంలో శనివారం నవదుర్గ సామూహిక వ్రతం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు పెద్ద సంఖ్యలో వ్రతంలో పాల్గొని తమ కోరికలు తీర్చాలని అమ్మవారిని మొక్కుకున్నారు. అనంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

- జూనియర్ సివిల్ జడ్జి భార్గవి
- భిక్కనూరులో రైతు న్యాయచైతన్య సదస్సు



భిక్కనూరులో రైతు న్యాయచైతన్య సదస్సులో మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భార్గవి

భిక్కనూరు: రైతులు తమ హక్కులు, చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని కామారెడ్డి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి భార్గవి అన్నారు. శనివారం భిక్కనూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు న్యాయచైతన్య సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులు నకిలీ ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వల్ల కలిగే ఇబ్బందుల గురించి అగ్రిలీగలైట్ ద్వారా ఫిర్యాదు చేస్తే వారికి కలిగిన నష్టంపై చర్యలు తీసుకుంటామన్నారు. రైతులకు న్యాయ సలహాలు అందించేందుకు పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో ఉంచామని, వారి సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఆర్‌బీ రమేశ్ చంద్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ కే. మోహన్‌రావు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చిరంజీవి, పారా లీగల్ వాలంటీర్లు సంతోష్‌రెడ్డి, నరేష్‌లతో పాటు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే కేసీఆర్ ధ్యేయం

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్



పార్టీలో చేరిన వారితో విప్ గంప గోవర్ధన్

కామారెడ్డి క్రైం: రైతు సంక్షేమమే కేసీఆర్ ధ్యేయమని కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డిలోని శుభం కన్వెన్షన్‌లో శనివారం బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పార్టీలో చేరికల కార్యక్రమం నిర్వహించారు. భిక్కనూర్ మండలం బస్వాపూర్, జంగంపల్లి, అంతంపల్లి, దోమకొండ మండలం లింగుపల్లి, ముత్యంపేట్, కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు టేక్రియాల్ గ్రామానికి చెందిన మొత్తం 500 మంది ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. గులాబీ కండువాలు వేసి వారిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణలో జరిగిన అభివృద్ధి దేశంలోని ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. మన రాష్ట్రంలో ఉన్న సంక్షేమ పథకాలు ఏ రాష్ట్రంలో లేవన్నారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఫుడ్ కమిషన్ మాజీ చైర్మన్ కొమ్ముల తిర్మల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలి



సూచనలిస్తున్న ఆర్డీవో భుజంగ్‌రావు



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న ఎన్నికల అధికారి ముజీబ్

బాన్సువాడ రూరల్/బాన్సువాడ: అసెంబ్లీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రిసైడింగ్ అధికారులు కృషి చేయాలని బాన్సువాడ ఆర్డీవో భుజంగ్‌రావు అన్నారు. శనివారం బాన్సువాడలోని ప్రభుత్వ ఎస్‌ఆర్‌ఎన్‌కే డిగ్రీకళాశాలలో ఆర్‌వో, పీవో, ఏపీవోలకు శిక్షణ ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. ఎన్నికల అధికారులు, సిబ్బంది సమన్వయంగా పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది అత్యంత పారదర్శకంగా పనిచేయాలన్నారు. పోలింగ్ విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రొజెక్టర్ ద్వారా పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. తహసీల్దార్లు వరప్రసాద్, భాను ప్రసాద్, ఎంఈవో నాగేశ్వరరావు, జూనియర్ అసిస్టెంట్ ఎంబరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి: పీవో, ఏపీవోలు ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని మాస్టర్ ట్రైనీలు వెంకటేశం అన్నారు. శనివారం ఎల్లారెడ్డి మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీవో, ఏపీవోలకు ఎన్నికల విధులకు సంబంధించి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈవీఎంలు తీసుకు వెళ్లే సమయం నుంచి పోలింగ్ ముగిసి ఈవీఎంలు అప్పగించేంత వరకు చేయాల్సిన విధుల గురించి వారికి వివరించారు.

బిచ్కుందలో..

బిచ్కుంద(జుక్కల్): ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి శనివారం బిచ్కుంద డిగ్రీ కళాశాలలో ఎన్నికల అధికారి తహసీల్దార్ ముజీబ్ అవగాహన కల్పించారు. పోలింగ్ ముందు, పోలింగ్ రోజున పోలింగ్ బూత్‌లలో వ్యవహరించాల్సిన విధుల పట్ల శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

బీసీలను విస్మరిస్తున్న పార్టీలకు బుద్ధి చెబుతాం



కామారెడ్డి టౌన్: రాష్ట్రంలో బీసీలను విస్మరిస్తున్న రాజకీయ పార్టీలకు బుద్ధి చెబుతామని బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నీల నాగరాజు హెచ్చరించారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. రాబోవు ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంబీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు మఠం విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పెద్దోళ్ల మహేష్, ఎల్లారెడ్డి నియోజకవర్గ అధ్యక్షుడు ఎస్.దయాకర్, ఉపాధ్యక్షుడు సిరిగాద రమేష్, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్ ప్రచారం



భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పెద్దమల్లారెడ్డి, మోటాట్‌పల్లి, తిప్పాపూర్, భాగర్తిపల్లి, లక్ష్మీదేవునిపల్లి గ్రామాల్లో గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మద్ది చంద్రకాంత్‌రెడ్డి, కిసాన్ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు కుంట లింగారెడ్డి, కాంగ్రెస్ బ్లాక్ కమిటీ అధ్యక్షుడు బల్యాల సుదర్శన్ మండలాధ్యక్షుడు బీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోరు మోటార్ అందజేత



దోమకొండ: మండలంలోని గొట్టిముక్కుల గ్రామానికి చెందిన మున్నూరుకాపు సంఘ భవనానికి బోరుమోటార్‌ను బీబీపేట మండలం జనగామ గ్రామానికి చెందిన ఎస్‌ఆర్ ఫౌండేషన్ తరఫున అందజేశారు. ఫౌండేషన్ చైర్మన్ సుభాష్‌రెడ్డి ద్వారా రూ.25 వేల విలువైన బోరుమోటర్‌ను అందజేసి బిగించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ ముదాం గంగయ్య, మున్నూరుకాపు సంఘం ప్రతినిధులు ఉన్నారు.

స.హ. చట్టంపై అవగాహన

కామారెడ్డి అర్బన్: సమాచార చట్టం, అప్పిలేట్ విధానం, కోరిన సమాచారం ఇవ్వని అధికారులపై రాష్ట్ర సమాచార కమిషనర్‌కు ఎలా ఫిర్యాదు చేయాలనే అంశాలపై ప్రతి ఒక్కరు తెలుసుకొని ఉండాలని సమాచార చట్ట పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. శనివారం కామారెడ్డి సెట్విన్ శిక్షణ కేంద్రంలో అవగాహన సమావేశం నిర్వహించారు. సమావేశంలో సెట్విన్ ఇంచార్జి మోయిస్, స.హ. చట్ట పరిరక్షణ కమిటి జోనల్ అధ్యక్షుడు సిర్నాపల్లి ప్రదీప్‌కుమార్, మహిళా జిల్లా కార్యదర్శి డి.లలిత, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంవీ భాస్కర్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు

- ఆదాబ్ పార్టీ అధ్యక్షుడు హసన్ షేక్



మాట్లాడుతున్న ఆబాద్ పార్టీ నాయకులు

కామారెడ్డి టౌన్/కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలో కేసీఆర్ పాలనపై విసుగు చెందిన ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని, రాష్ట్రంలోని 119 నియోజకవర్గాలకు అభ్యర్థులను ఎన్నికల బరిలోకి దింపుతామని ఆదాబ్ పార్టీ అధ్యక్షుడు షేక్ హసన్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో ఆయన మాట్లాడారు. విద్య, వైద్యం, యువతకు ఉపాధి లక్ష్యంగా పోటీ చేస్తామన్నారు. రైతులను అన్నివిధాల ఆదుకుంటామన్నారు. సీఎం కేసీఆర్ కామారెడ్డిలో పోటీ చేస్తున్న సందర్భంగా ఆదాబ్ పార్టీ అధ్యక్షుడు సైతం కామారెడ్డిలో పోటీ చేస్తారని పార్టీ నాయకులు తెలిపారు.

ప్రజలకు సేవ చేసేవారిని గెలిపించాలి

- కామారెడ్డి అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి వెంకటరమణారెడ్డి



బీజేపీలో చేరిన వారితో వెంకటరమణారెడ్డి

దోమకొండ: కామారెడ్డి నియోజకవర్గ ప్రజలు తమకు సేవ చేసేవారిని గెలిపించుకోవాలని బీజేపీ అసెంబ్లీ అభ్యర్థి కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రానికి చెందిన పలువురు బీజేపీలో చేరగా ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్ మంత్రులకు, ఎమ్మెల్యేలకే అందుబాటులో ఉండరన్నారు. బీఆర్‌ఎస్‌కు ఓటు వేస్తే నవగ్రహాలకు ఓటు వేసినట్లు అవుతుందన్నారు. కామారెడ్డిలో కాషాయ జెండా ఎగురవేయాలని ప్రతి ఒక్కరు బీజేపీకి మద్దతు ఇవ్వాలని కోరారు. పార్టీ మండల అధ్యక్షుడు చింతల రాజేష్, నాయకులు ఉన్నారు.

ఆటోలకు నంబర్ల కేటాయింపు



ఆటో డ్రైవర్‌లతో ఎస్సై ఆంజనేయులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయి పోలీసు స్టేషన్‌లో శనివారం తాడ్వాయికి చెందిన ప్యాసింజర్ ఆటోలకు నంబర్లను ఎస్సై ఆంజనేయులు కేటాయించారు. వారం రోజుల క్రితం ఆటో డ్రైవర్లు, ఓనర్లతో మాట్లాడి అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. దీంతో పాసింజర్ ఆటోలు నడుపుతున్న డ్రైవర్లు, ఓనర్లు ఆటోలకు సంబంధించిన లైసెన్స్‌లు, ఇన్సూరెన్సులు, ట్యాక్స్‌లు, ఫిట్నెస్, పొల్యూషన్ సర్టిఫికెట్లు సమకూర్చుకోవడంతో 35 ఆటోలకు నంబర్లను కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్సై, డ్రైవర్లను అభినందించారు. ఆటో యూనియన్ సభ్యులు శంకర్‌గౌడ్, రాజయ్య, కిషన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షను రూపుమాపాలి



బాలింతలను సన్మానిస్తున్న అధికారులు

కామారెడ్డి టౌన్: సమాజంలో లింగ వివక్షతను పూర్తిగా రూపు మాపాలని ఇందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి బావయ్య తెలిపారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటి బచావో..బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రం ఆస్పత్రిలో ఆడ శిశువులకు జన్మనిచ్చిన మహిళలను సన్మానించారు. భవిష్యత్తు తరాల ఆడపిల్లలే పట్టుకొమ్మలని అభివర్ణించారు. ఆస్పత్రి ఆర్‌ఎంవో డాక్టర్ సుజాత, మహిళా శిశు సంక్షేమ శాఖ సిబ్బంది అశోక్, నరేష్, సౌందర్య, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిన బస్వాపూర్ కాంగ్రెస్ నేతలు



భిక్కనూరు: బస్వాపూర్ గ్రామ యువజన కాంగ్రెస్ నేతలు శనివారం ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. బస్వాపూర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రామగల్ల బాబు, ఉపాధ్యక్షులు దయాకర్‌తో పాటు మరో 35 మంది బీఆర్‌ఎస్‌లో చేరారు. వీరికి ప్రభుత్వ విప్, బీఆర్‌ఎస్ పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. ఆత్మ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, నేతలు తిర్మల్‌రెడ్డి, మల్లారెడ్డి, మల్లేషం, రాజిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో శనివారం ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించాయి. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో కేంద్ర బలగాలు ముందస్తుగా ప్రజలు శాంతియుతంగా ఉండాలని కవాతు నిర్వహించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా కవాతు చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, లింగంపేట ఎస్సై ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి మహర్షి జయంతి



బిచ్కుందలో ర్యాలీ నిర్వహిస్తున్న ముదిరాజ్‌లు



మేనూర్‌లో జయంతి నిర్వహిస్తున్న భక్తులు



జుక్కల్ మండలం బస్వాపూర్‌లో..

బిచ్కుంద/మద్నూర్/నిజాంసాగర్: బిచ్కుంద, మద్నూర్, జుక్కల్ మండలాల్లో శనివారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి ఆలయాల్లో ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిచ్కుందలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ తీశారు. వాల్మీకి రాముడి భక్తుడని, ఆయన చూపిన మార్గంలో నడుద్దామని వారు పిలుపునిచ్చారు.

కేసీఆర్ సభను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు

నిజాంసాగర్(జుక్కల్): అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి వస్తున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను బీఆర్‌ఎస్ శ్రేణులు తరలి వచ్చి విజయవంతం చేయాలని జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదార్ రాజు అన్నారు. శనివారం మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. ఈ నెల 30న జుక్కల్ చౌరస్తా వద్ద జరుగనున్న సభకు నిజాంసాగర్, మహమ్మద్‌నగర్ నుంచి 8 వేల మంది తరలిస్తున్నామన్నారు.

బాన్సువాడలో సభను జయప్రదం చేయండి

బాన్సువాడ రూరల్: ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం బాన్సువాడలోని అంగడిబజార్‌లో నిర్వహిస్తున్న కేసీఆర్ బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మోహన్‌నాయక్ కోరారు. శనివారం ఆయన బోర్లం గ్రామంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పార్టీ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించాలన్నారు. రైతుబంధు జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి, నాయకులు కమటాల శ్రీనివాస్‌రెడ్డి, నర్సింలు, రాజేశ్వర్‌గౌడ్, దేవేందర్‌రెడ్డి,సయ్యద్ జలీల్, తదితరులు పాల్గొన్నారు.

పలు ఆలయాల మూసివేత





భిక్కనూరు సిద్ధరామేశ్వరాలయాన్ని మూసేస్తున్న పూజారులు, తాడ్వాయి శబరిమాత ఆశ్రమాన్ని..

సాక్షినెట్‌వర్క్: చంద్ర గ్రహణం సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా పలు ఆలయాలను మూసివేశారు. గ్రహణం ఉండడంతో దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం ఆలయాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరమే భక్తులకు ఆలయంలోకి అనుమతిస్తామని ఆయా ఆలయాల అధికారులు, అర్చకులు తెలిపారు.


కేసీఆర్‌ను గెలిపించుకుందాం



ఘన్‌పూర్‌లో ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న నేతలు

మాచారెడ్డి: కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఘన్‌పూర్ ఉప సర్పంచ్ కోరారు. ఈ మేరకు శనివారం అన్ని కుల సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సీఎంను గెలిపిస్తే కామారెడ్డి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్‌కు ఓటేస్తామని తీర్మానం చేశారు. కార్యక్రమంలో కాకులగుట్ట సర్పంచ్ హేముల నాయక్, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్‌చారి, దయాకర్ రావు, సుదర్శన్ గౌడ్, నారాయణ ఉన్నారు.

పిట్లంలో జవాన్ల మార్చ్



పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై పోలీసులు శనివారం సశస్త్ర సీమాబల్ ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కొండ మాట్లాడుతూ.. డీఎస్పీ జగన్నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సశస్త్ర సీమాబల్ వారి ఆధ్వర్యంలో పిట్లంలో మార్చ్ నిర్వహించినట్లు తెలిపారు. సీఐ మురళి, నిజాంసాగర్ ఎస్సై రాజశేఖర్, పిట్లం పోలీసులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ సర్పంచ్ మృతి



బాన్సువాడ రూరల్: సంగోజీపేట్ గ్రామ మాజీ సర్పంచ్ ఇప్పల చిన్న సాయిలు(50) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఆయన ఉప సర్పంచ్‌గా, సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించారు. మృతి వార్త తెల్సుకున్న డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి సంగోజీపేట్ గ్రామానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సంగ్రాం నాయక్, సర్పంచ్ ఈడ్గి లక్ష్మీ శంకర్‌గౌడ్ ఉన్నారు.